పాతాళంలోకి కీలక రంగాలు

- మూడున్నరేండ్ల కనిష్ఠానికి వృద్ధిరేటు
- ఆగస్టులో -1.8 శాతంగా నమోదు
- మెజారిటీ రంగాల్లో క్షీణించిన ఉత్పాదకత
- నిరాశాజనకంగా పరిశ్రమల తీరు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30: దేశంలో పారిశ్రామిక ప్రగతి పాతాళానికి దిగజారింది. కీలక రంగాల్లో నిస్తేజం ఆవరించింది మరి. ఆగస్టులో మూడున్నరేండ్ల కనిష్ఠాన్ని తాకుతూ -1.8 శాతానికి వృద్ధిరేటు పతనం కావడం ప్రమాద ఘంటికల్ని మోగిస్తున్నదిప్పుడు. 2021 ఫిబ్రవరిలో -3.3 శాతంగా నమోదైంది. మళ్లీ ఆ తర్వాత ఇప్పుడే నెగెటివ్ జోన్‌లోకి కోర్ సెక్టార్స్ పడిపోవడం గమనార్హం. ఎరువులు, ఉక్కు రంగాలు మినహా బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, సిమెంట్, విద్యుత్తు రంగాల్లో ఉత్పాదకత క్షీణించింది. ఈ మేరకు సోమవారం కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన అధికారిక గణాంకాల్లో తేలింది. నిజానికి ఈ ఏడాది జూలైలో 6.1 శాతం వృద్ధిరేటు కనిపించింది. ఇక గత ఏడాది ఆగస్టులో ఏకంగా 13.4 శాతం వృద్ధి నమోదైంది. కానీ ఏడాది వ్యవధిలో అంతా తారుమారైపోయింది.

ఐఐపీపై ప్రభావం

భారతీయ పారిశ్రామిక రంగ ముఖచిత్రాన్ని ప్రతిబింబించే పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ)లో ఎరువులు, ఉక్కు, బొగ్గు, ముడి చమురు, సహజ వాయువు, రిఫైనరీ ఉత్పత్తులు, సిమెంట్, విద్యుత్తు రంగాల వాటానే 40.27 శాతంగా ఉన్నది. అయితే ఈ 8 కీలక రంగాల్లో ఇప్పుడు 6 రంగాలు నిరాశాజనకంగా కనిపిస్తున్నాయి. గతంతో పోల్చితే ఈ రంగాల్లో తయారీ దారుణంగా పడిపోయింది. మిగతా 2 రంగాల్లోనూ ఎరువుల తయారీ ఒక్కటే ఆకట్టుకునే స్థాయిలో ప్రదర్శనని చ్చింది. 1.8 శాతం నుంచి 3.2 శాతానికి వృద్ధి చెందింది. అయితే ఉక్కు పరిశ్రమల్లోనూ మందగమన ఛాయలు కనిపిస్తున్నాయి. నిరుడు ఆగస్టులో ఈ రంగం ఉత్పాదకత రేటు 16.4 శాతంగా ఉన్నది. కానీ ఈ ఏడాది ఆగస్టులో ఇది 4.5 శాతానికి దిగజారడం పరిస్థితుల తీవ్రతకు అద్దం పడుతున్నది. దీంతో మొత్తం ఐఐపీనే ప్రభావితం చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఈ క్రమంలోనే రాబోయే నెలల్లో ఐఐపీ గణాంకాలు పడిపోవచ్చన్న అంచనాలు ఇప్పుడు గట్టిగానే వినిపిస్తున్నాయి. ప్రముఖ రేటింగ్ ఏజెన్సీ ఇక్రా అంచనాల ప్రకారం ఆగస్టులో ఐఐపీ గణాంకాలు 1 శాతానికి పడిపోవచ్చు. జూలైలో ఇది 4.8 శాతంగా ఉన్నది. ఇక సెప్టెంబర్‌లోనూ కీలక రంగాల ప్రదర్శన అసంతృప్తిగానే ఉండొచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఆగస్టులో కీలక రంగాల తీరిది

రంగం	వృద్ధిరేటు (శాతాల్లో)
బొగ్గు	-8.1
ముడి చమురు	-3.4
సహజ వాయువు	-3.6
రిఫైనరీ ఉత్పత్తులు	-1
సిమెంట్	-3
విద్యుత్తు	-5
ఎరువులు	3.2
ఉక్కు	4.5



2024-25 మొదలు..

ఈ ఆర్థిక సంవత్సరం మొదలు కీలక రంగాల పనితీరు అంతంతమాత్రంగానే సాగుతున్నది. ఏప్రిల్-ఆగస్టు మధ్య 8 కీలక రంగాల వృద్ధిరేటు 2023-24ఇదే వ్యవధితో పోల్చితే 8 శాతం నుంచి 4.6 శాతానికి తగ్గింది. పరిస్థితులు ఇకపైనా ఇలాగే ఉంటే దేశ జీడీపీ అంచనాలను అవి పెద్ద ఎత్తునే ప్రభావితం చేయవచ్చన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలోనే వినియోగదారుల కొనుగోలు శక్తిని పెంచేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, ఆర్బీఐ ఇకనైనా వడ్డీరేట్లను తగ్గించాలని అటు ఇండస్ట్రీ, ఇటు మార్కెట్ వర్గాలూ డిమాండ్ చేస్తున్నాయి.

చిన్న మొత్తాలపై వడ్డీ యథాతథం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30: చిన్న మొత్తాలపై వడ్డీరేట్లను యథాతథంగా ఉంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసికానికిగాను చిన్న మొత్తాల పొదుపు స్కీంలు, పీపీఎఫ్, ఎన్ఎస్‌సీ వడ్డీరేట్లలో ఎలాంటి మార్పులు చేయలేదు. అక్టోబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు వడ్డీరేట్లు వర్తించనున్నదని ఆర్థిక మంత్రిత్వ శాఖ తాజాగా వెల్లడించింది. వరుసగా వడ్డీరేట్లలో మార్పులు చేయకపోవడం ఇది వరుసగా మూడోసారి. సుకన్యా సమృద్ధి స్కీంపై 8.2 శాతం వడ్డీ, అలాగే పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్(పీపీఎఫ్)పై 7.1 శాతం, పోస్టాఫీస్ సేవింగ్ డిపాజిట్లపై 4 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది. కిసాన్ వికాస్ పత్రాలపై 7.5 శాతం, జాతీయ పొదుపు సర్టిఫికేట్(ఎన్ఎస్‌సీ)పై 7.7 శాతం వడ్డీని చెల్లిస్తున్నది.

పెరగనున్న బీమా ప్రీమియం!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30: బీమా ప్రీమియంలు పెరిగే అవకాశాలు కనిపిస్తున్నాయి. మంగళవారం నుంచి అమల్లోకి రానున్న కొత్త నిబంధనలతో బీమా ప్రీమియంలు లేదా ఏజెంట్ల కమీషన్లలో కోత పడే అవకాశాలున్నట్లు విశ్లేషకులు చెబుతున్నారు. మెరుగైన సరెండర్ వాల్యూ అందించాలన్న ఐఆర్‌డీఏఐ ఆదేశాలు అమల్లోకి రావడమే ఇందుకు కారణం. కొందరు గడువు ముగియక ముందే తమ పాలసీ రద్దు చేసుకుంటున్నారు. ఈ సరెండర్ విలువకు సంబంధించి ఐఆర్‌డీఏఐ మార్గదర్శకాలను జారీ చేసింది. ఈ పాలసీ సరెండర్ చేస్తే వారికి లాభించనున్నది.

కొరమాండల్ పాలిహౌజ్

హైదరాబాద్, సెప్టెంబర్ 30:ప్రముఖ ఎరువుల సంస్థ కొరమాండల్ ఇంటర్నేషనల్..హైదరాబాద్‌కు సమీపంలోని శామిర్‌పేట్ వద్ద పాలిహౌజ్‌ను ప్రారంభించింది. వ్యవసాయరంగంలో వినూత్న పరిశోధనలు గావించడానికి ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌ను కంపెనీ సీఈవో, ఎండీ శంకర సుబ్రమణియన్ ఆరంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..రైతులకు ప్రయోజనాలు కల్పించాలనే ఉద్దేశంతో ప్రభుత్వరంగ సంస్థలతో కలిసి వ్యవసాయరంగంలో పరిశోధనలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

యుద్ధమేఘాలు

సెన్సెక్స్ 1,272, నిఫ్టీ 368 పాయింట్ల నష్టం

భారీగా నష్టపోయిన దేశీయ సూచీలు

రూ.3.57 లక్షల కోట్ల మదుపరుల సంపద ఆవిరి

పతనానికి కారణాలు

- ఎఫ్ఐఐలు తమ పెట్టుబడులను చైనా మార్కెట్లకు తరలించడం
- పశ్చిమాసియా దేశాల్లో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులు
- అమెరికా నిరుత్సాహక గణాంకాలు, ఫెడ్ చీఫ్ పావెల్ ప్రసంగం
- జపాన్ మార్కెట్లు వడ్డీరేట్లు పెంచడం
- విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు భారీగా పెట్టుబడులను ఉపసంహరించుకోవడం

ముంబై, సెప్టెంబర్ 30: దేశీయ స్టాక్ మార్కెట్లు కుప్పకూలాయి. అంతర్జాతీయ దేశాల్లో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులకు తోడు జపాన్ సూచీలు కుప్పకూలడం దేశీయ మార్కెట్ల పతనానికి ఆజ్యంపోశాయి. బ్యాంకింగ్, ఆర్థిక, వాహన రంగ షేర్లలో క్రయవిక్రయాలు జోరుగా సాగాయి. నష్టాల్లో ప్రారంభమైన సూచీలు చివరి వరకు అదే ట్రెండ్‌ను కొనసాగించాయి. మధ్యాహ్నం తర్వాత యూరప్ స్టాక్ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు మదుపరుల్లో ఆందోళనను రెట్టింపుచేశాయి. మిడిల్ ఈస్ట్ దేశాల్లో యుద్ధ మేఘాలు కమ్ముకుంటుండటం ఈ భారీ పతనానికి ప్రధాన కారణమని దలాల్ స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. మళ్లీ యుద్ధమేఘాలు కమ్ముకుంటుండటంతో అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధర భగ్గుమనే అవకాశాలు ఉండటం కూడా నష్టాలకు ప్రధాన కారణం. ఇంట్రాడేలో 1,300 పాయింట్లకు పైగా నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు 1,272.07 పాయింట్లు (1.49 శాతం) నష్టపోయి 85 వేల దిగువకు 84,299.78 వద్ద నిలిచింది. మరో సూచీ నిఫ్టీ కూడా 368.10 పాయింట్లు లేదా 1.41 శాతం పతనం చెంది 25,810.85 వద్ద ముగిసింది. స్టాక్ మార్కెట్ల భారీ నష్టంతో లక్షల కోట్ల మదుపరుల సంపద హారతి కర్పూరంలా కరిగిపోయింది. బీఎస్ఈ లిస్టైన కంపెనీల మార్కెట్ క్యాపిటలైజేషన్ విలువ రూ.3,57,885.53 కోట్లు కరిగిపోయి రూ.4,74,35,137.15 కోట్లకు (5.66 ట్రిలియన్ డాలర్ల) పడిపోయింది. గడిచిన రెండు నెలలుగా పెరుగుతూ వచ్చిన నిఫ్టీ భారీగా నష్టపోయిందని, చైనా ఇటీవల తీసుకున్న ఉద్దీపన ప్యాకేజీతో విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ పెట్టుబడులను అక్కడికి తరలించడం కూడా ఇతర దేశాల సూచీలపై ప్రతికూల ప్రభావం చూపాయని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీ హెడ్ దీపక్ జసాని తెలిపారు.

- రిలయన్స్ 3.23 శాతం నష్టపోయి టాప్ లూజర్‌గా నిలిచింది. దీంతోపాటు యాక్సిస్ బ్యాంక్, మహీంద్రా అండ్ మహీంద్రా, నెస్లె, టెక్ మహీంద్రాలు రెండు శాతానికి పైగా నష్టపోయాయి.
- వీటితోపాటు మారుతి, ఎస్బీఐ, టాటా మోటర్స్, ఇన్ఫోసిస్, ఎయిర్‌టెల్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఎల్అండ్‌టీ, హెచ్‌సీఎల్ టెక్ షేర్లు దిగువముఖం పట్టాయి.

రిలయన్స్ షేరు భారీ పతనం

దేశీయ కుబేరుడిలో ఒకరైన ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు కుప్పకూలింది. కంపెనీ షేరు విలువ 3.23 శాతం నష్టపోయి రూ.2,953.80 వద్ద నిలిచింది. అటు ఎన్ఎస్ఈలోనూ షేరు 3.13 శాతం నష్టంతో రూ.2,956.70 వద్ద ముగిసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.66,818.76 కోట్లు కోల్పోయి రూ.20 లక్షల కోట్ల దిగువకు పడిపోయింది. చివరకు రూ.19,98,503.98 కోట్లకు పడిపోయింది.

డిసెంబర్ నాటికి లక్ష పాయింట్లకు సెన్సెక్స్

ఈ ఏడాది చివరినాటికి సెన్సెక్స్ లక్ష పాయింట్లకు చేరుకునే అవకాశాలున్నాయని మార్కెట్ పండితులు అంచనావేస్తున్నారు. దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతం అవుతుండటం ఇందుకు కారణమన్నారు. గడిచిన మూడు నెలల్లో సూచీ 18 శాతం రిటర్నులు పంచడంతో ఈ ఏడాది చివరినాటికి 1,00,000 పాయింట్లకు చేరుకోవడం పెద్ద కష్టమేమి కాదని వెటరన్ ఎమర్జింగ్ మార్కెట్ ఇన్వెస్టర్ మార్క్ మోబియన్ తన అభిప్రాయాన్ని వ్యక్తంచేశారు. 2015 తర్వాత ఒకే ఏడాది ఇంతటి స్థాయిలో రిటర్నులు పంచడం ఇదే తొలిసారన్నారు.

ఫ్లిప్‌కార్ట్‌లో యెజ్డీ అమ్మకాలు

ముంబై, సెప్టెంబర్ 30: వాహన విక్రయాలను పెంచుకోవడానికి యెజ్డీ కంపెనీ వినూత్నంగా ఆలోచించింది. దీంతో ప్రముఖ ఈ-కామర్స్ వేదిక ఫ్లిప్‌కార్ట్‌లో జావా యెజ్డీ మోటర్‌సైకిళ్లు లభించనున్నాయి. అవును.. ఇప్పటి దాకా స్మార్ట్‌ఫోన్లు, టెలివిజన్లు ఇతర కన్స్యూమర్ డ్యూరబుల్స్, గృహోపకరణాలు, దుస్తులు, పాదరక్షలు, కన్స్యూమర్ గూడ్స్ మొదలగునవి అమ్ముతున్న ఫ్లిప్‌కార్ట్‌లో ఇకపై యెజ్డీ అమ్మకాలు జరుగుతాయని సోమవారం ఈ బ్రాండ్ మాతృ సంస్థ క్లాసిక్ లెజెండ్స్ ప్రకటించింది. ఈ మేరకు ఇరు సంస్థల మధ్య ఒప్పందం జరిగిందని, ఇది భారతీయ ప్రీమియం మోటర్‌సైకిల్ మార్కెట్‌లో కీలక పరిణామమని పేర్కొన్నది. ఫ్లిప్‌కార్ట్‌తో జట్టు కట్టడం వల్ల అందులోని 50 కోట్ల కుపైగా కస్టమర్లకు తమ బ్రాండ్ చేరువ కాగలదన్న విశ్వాసాన్ని ఈ సందర్భంగా క్లాసిక్ లెజెండ్స్ సీఈవో ఆశిష్ సింగ్ జోషి వ్యక్తం చేశారు. ఇదిలావుంటే ఫ్లిప్‌కార్ట్‌లో యెజ్డీ మోటర్‌సైకిళ్ల కొనుగోలుపై నో-కాస్ట్ ఈఎంఐ, బై నౌ-పే లేటర్ స్కీములు, డౌన్ పేమెంట్ లేకుండా ఈఎంఐ ప్లాన్ల వంటివీ అందుబాటులో ఉంటాయని చెప్పున్నారు. కస్టమర్లు ఎంపిక చేసిన మాడళ్లపై రూ.22,500 విలువైన ప్రయోజనాలనూ పొందవచ్చు. యాక్సిస్ బ్యాంక్ క్రెడిట్ కార్డు వినియోగం తదితర మార్గాల ద్వారా వీటిని అందుకోవచ్చు.

ఎయిర్‌టెల్ స్పెక్ట్రం బకాయి చెల్లింపు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 30: ఎయిర్‌టెల్ తన స్పెక్ట్రం బకాయిలను పూర్తిగా చెల్లించింది. 2016లో స్పెక్ట్రం కొనుగోలు చేసిన సంస్థ.. బాకీ రూ.8,465 కోట్లను కేంద్ర ప్రభుత్వానికి చెల్లించింది. 9.3 శాతం వార్షిక వడ్డీతో వీటిని చెల్లించినట్లు సంస్థ బీఎస్ఈకి సమాచారం అందించింది. దేశవ్యాప్తంగా 4జీ సేవలు అందించడానికి పదేండ్ల క్రితం స్పెక్ట్రాన్ని కొనుగోలు చేసినది తెలిసిందే.

పల్సర్‌పై 10 వేల వరకు రాయితీ

పుణె, సెప్టెంబర్ 30: ప్రస్తుత పండుగ సీజన్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక ఆఫర్లను అందుబాటులోకి తీసుకొచ్చింది బజాజ్ ఆటో. పల్సర్ రేంజ్ వాహనాలపై రూ.10 వేల వరకు ప్రయోజనాలు కల్పిస్తున్నట్లు తెలిపింది. ఎంపిక చేసిన పల్సర్ మాడళ్లపై రూ.5 వేల వరకు క్యాష్‌బ్యాక్, హెచ్‌డీఎఫ్‌సీ క్రెడిట్ కార్డు ద్వారా జరిపే కొనుగోళ్లపై రూ.5 వేలు ఇన్‌స్టంట్ క్యాష్‌బ్యాక్‌లున్నాయి.

9999కు రూ.20 లక్షలు!

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): ఫ్యాన్సీ నంబర్ల బిడ్డింగ్‌లో భాగంగా ఆర్టీఏ ఖజానాలో సోమవారం రూ.47.12 లక్షల ఆదాయం చేరింది. ఖైతరాబాద్ ఆర్టీఏ కార్యాలయం నిర్వహించిన ఫ్యాన్సీ నంబర్ల వేలంలో టీజీ 09 బీ 9999 నంబర్‌ను రూ.20 లక్షలకు ఒక మొబైల్ కంపెనీ దక్కించుకున్నట్టు హైదరాబాద్ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ రమేశ్ తెలిపారు. టీజీ09సీ0001 నంబర్‌కు రూ.10.27 లక్షలు, టీజీ 09 ఈ 0007 నంబర్‌కు రూ.లక్ష పలికినట్టు వెల్లడించారు. వాహనదారులు ఇతర నంబర్లకు కూడా అధిక ధర వెచ్చించారని పేర్కొన్నారు.

యూట్యూబర్ నరేశ్‌గౌడ్ విడుదల

నాంపల్లి కోర్టులు, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) : సీఎం రేవంత్‌రెడ్డిపై అనుచిత వ్యాఖ్యలు, యూట్యూబ్ వేదికగా తప్పుడు పోస్టులు పెట్టినట్టు కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైన కేసులో బీఆర్ఎస్‌కు చెందిన యూట్యూబర్ సిద్దమోని నరేశ్‌గౌడ్‌ను పోలీసులు విడుదల చేశారు. సెక్షన్లు 67 ఐడీఏ-2000-2008, 353(2), 352, 193, 196 బీఎన్ఎస్ కింద కేసు నమోదు చేసి సోమవారం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ముఖ్యమంత్రి పేరు, ప్రతిష్ఠలకు భంగం వాటిల్లేలా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినట్టు అహ్మద్ అస్లామ్ అనే న్యాయవాది ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. 41-ఏ నోటీసులు జారీ చేయాలని బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాది లక్ష్మణ్‌గంగా పోలీసులను ప్రశ్నించడంతో రిమాండ్‌కు తరలించకుండా విడుదల చేశారు. న్యాయం గెలిచిందని బీఆర్ఎస్ నేతలు సంతోషం వ్యక్తంచేశారు.

దుబాయిలో డెలివరీ బాయ్స్ ఉద్యోగాలు: టామ్‌కామ్

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): దుబాయిలో డెలివరీ బాయ్స్ ఉద్యోగాలకు టామ్‌కామ్ దరఖాస్తులు కోరుతున్నది. ఇండియన్ టూ వీలర్ డ్రైవింగ్ లైసెన్సు కలిగివుండి, 21-40 సంవత్సరాల మధ్య వయసు ఉన్నవారు అర్హులను తెలిపింది. ఆసక్తిగల వారు tomcom.resume@gmail.comకు రెజ్యూమ్ మెయిల్ చేయాలని సూచించింది. వివరాలకు టామ్‌కామ్ వెబ్‌సైట్‌ను సంప్రదించాలని కోరింది.

మెట్రో లేని 'ఉత్త'ర నగరం!

- మెట్రో మాకొద్దా.. మేం చేసిన పాపమేమిటి?
- ఉత్తర హైదరాబాద్‌పై సీఎం రేవంత్ చిన్నచూపు
- జనమే లేని ఫ్యూచర్ సిటీకి 40 కి.మీ. మెట్రోనా?
- సర్కారుపై మేడ్చల్, శామీర్‌పేట వాసుల మండిపాటు
- మేడ్చల్ మెట్రో సాధన సమితి పేరుతో ఉద్యమం
- హైకోర్టులో పిటిషన్ వేసేందుకు సిద్ధమైన స్థానికులు

హైదరాబాద్ సిటీబ్యూరో, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): 'మేమూ మనుషులమే. హైదరాబాద్‌లో నివాసం ఉంటున్నవాళ్లమే. లేని ఫోర్త్ సిటీ కోసం 40 కిలోమీటర్ల మేర మెట్రోమార్గాన్ని నిర్మిస్తున్నారు. అలాంటిది ఉత్తర హైదరాబాద్‌లోని సుచిత్ర, మేడ్చల్, అల్వాల్, శామీర్‌పేట వంటి ప్రాంతాలకు మెట్రో రైలు కారిడార్ ఎందుకు వేయరు? మాకొద్దా మెట్రో? మేం ఏం పాపం చేశాం?' అని స్థానిక ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఆదివారం హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ ప్రకటించిన రెండో దశ మెట్రో రైలు ప్రాజెక్టులో 116 కిలోమీటర్ల మేర కొత్తగా మెట్రో కారిడార్‌లను నిర్మిస్తామని ప్రకటించగా.. అందులో మేడ్చల్, శామీర్‌పేటవైపు ఉన్న ప్రాంతాలకు మెట్రో ప్రతిపాదన లేకపోవడంపై అక్కడి ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఉత్తర హైదరాబాద్‌కు మెట్రో కావాలని అడుగుతున్నా పరిగణనలోకి తీసుకోవడం లేదని మండిపడుతున్నారు. మేడ్చల్ మెట్రో సాధన సమితిగా సంఘటితమై కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉద్యమానికి సిద్ధమయ్యారు. భారీ మెట్రో విస్తరణ ప్రణాళికలు సిద్ధం చేస్తున్నా.. మేడ్చల్, దాని పరిసర ప్రాంతాలతో కూడిన ఉత్తర హైదరాబాద్‌ను ప్రభుత్వం విస్మరించిందని, ఇది ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని ధ్వజమెత్తారు.

ఈ నెల 6న ధర్నా

హైదరాబాద్‌కు ఉత్తరాన ఉన్న సికింద్రాబాద్ ప్యాట్నీ-శామీర్‌పేట, ప్యారడైజ్-మేడ్చల్ మార్గంలో లక్షల మంది ప్రజలు నివాసం ఉంటున్నారు. పరిశ్రమలు, వ్యాపార, వాణిజ్య కేంద్రాలు కూడా భారీగానే ఉన్నాయి. నిత్యం లక్షల మంది ఈ రెండు మార్గాల్లో రాకపోకలు సాగిస్తున్నారు. దీంతో కేసీఆర్ ప్రభుత్వం మెట్రో మార్గాలను ప్రతిపాదించింది. కానీ, అధికారంలోకి కాంగ్రెస్ ప్రభుత్వం ఆ రెండు మార్గాలను పక్కనపెట్టింది. గత 7-8 నెలలుగా రెండో దశపై కసరత్తు చేసినా.. ఉత్తర హైదరాబాద్ వైపు మాత్రం ఎలాంటి మార్గాలను ఖరారు చేయలేదు. దీన్ని నిరసిస్తూ అక్టోబర్ 6న జీడిమెట్ల గాంధీ విగ్రహం వద్ద ధర్నా, రాస్తారోకో నిర్వహించాలని మేడ్చల్ మెట్రో సాధన సమితి సభ్యులు నిర్ణయించారు. ప్రభుత్వంపై పోరాడేందుకు హైకోర్టును ఆశ్రయిస్తున్నామని, పిటిషన్‌ను కూడా సిద్ధం చేశామని తెలిపారు.

బోధన్‌లోని నిజాం చక్కెర ఫ్యాక్టరీ ఎదుట మాట్లాడుతున్న కార్మిక సంఘ నేతలు

చక్కెర ఫ్యాక్టరీ ప్రారంభం ఏమైంది?

- సెప్టెంబర్ 17లోగా తెరుస్తామన్న సీఎం
- కాలయాపనకే పరిమితమైన సర్కారు
- కార్మిక సంఘాల నాయకుల ఆగ్రహం

బోధన్, సెప్టెంబర్ 30: సెప్టెంబర్ 17లోపు నిజాం షుగర్ ఫ్యాక్టరీని తెరిపిస్తామన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హామీ ఏమైందని ఫ్యాక్టరీ కార్మికులు ప్రశ్నించారు. ఏకంగా సీఎం మాటకే దిక్కు లేకపోతే? ఎలా అని నిలదీశారు. సోమవారం నిజామాబాద్ జిల్లా బోధన్‌లోని షుగర్ ఫ్యాక్టరీ ఎదుట కార్మిక సంఘాల నేతలు మీడియాతో మాట్లాడారు. ఆసియాలోనే అతిపెద్ద చక్కెర కర్మాగారమైన నిజాం షుగర్స్‌ను తెరిపిస్తామన్న కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎలాంటి విధివిధానాలు రూపొందించలేదని, మరి ఎప్పుడు, ఎలా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. ఫ్యాక్టరీకి చెందిన భూములు ప్రైవేట్ యజమాని పేర రిజిస్ట్రేషన్ అయ్యాయని, ఫ్యాక్టరీ ఎలా తెరుస్తారని నిలదీశారు. ప్రైవేట్ యాజమాన్యం అక్రమంగా లేఆఫ్ ప్రకటించిందని, నాటి నుంచి వేతనాలు లేక తమ పరిస్థితి దుర్భరంగా మారిందని ఆవేదన వ్యక్తంచేశారు. పండుగలు ఎలా జరుపుకోవాలో అర్థంకావడం లేదని, బకాయి వేతనాల నుంచి కొంతయినా ఇప్పించాలని కార్మిక సంఘాల నేతలు కుమారస్వామి, ఎన్ రవిశంకర్‌గౌడ్, శ్రీనివాస్, బాలకృష్ణ, రాంబాబు, భాస్కర్, రమేశ్, శ్రీధర్ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

దసరాకు 6 వేల ప్రత్యేక బస్సులు

- హైదరాబాద్ శివారు నుంచి జిల్లాలకు
- ఓఆర్ఆర్ మీదుగా విజయవాడ, బెంగళూరుకు
- కరీంనగర్, నిజామాబాద్ మార్గాల్లో ఎలక్ట్రిక్ సూపర్‌లగ్జరీ బస్సులు

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ) :దసరా సందర్భంగా హైదరాబాద్ నుంచి సొంతూళ్లకు వెళ్లే వారి కోసం ప్రత్యేక బస్సులను ఏర్పాట్లు చేసినట్టు ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. సోమవారం సంబంధిత అధికారులతో ఆయన వర్చువల్‌గా సమావేశమై మాట్లాడారు. బతుకమ్మ, దసరా నేపథ్యంలో 6 వేల ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్టు తెలిపారు. ఈ నెల 1 నుంచి 15 వరకు ఎల్బీనగర్, ఉప్పల్, ఆరాంఘర్, కేపీహెచ్‌బీ, సంతోష్‌నగర్ నుంచి జిల్లాలకు ప్రత్యేక బస్సులు నడుపనున్నట్టు వెల్లడించారు. కరీంనగర్, నిజామాబాద్ మార్గాల్లో ఎలక్ట్రిక్ సూపర్ లగ్జరీ బస్సులను వినియోగించుకోవాలన్నారు. ఐటీ కారిడార్ ఉద్యోగుల సౌకర్యార్థం గచ్చిబౌలి ఓఆర్ఆర్ మీదుగా విజయవాడ, బెంగళూరు తదితర ప్రాంతాలకు ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్టు చెప్పారు. ప్రయాణికుల రద్దీ నేపథ్యంలో tgsrtbus.inలో ముందస్తు రిజర్వేషన్ చేసుకోవాలని సూచించారు. దసరా స్పెషల్ సర్వీసులకు సంబంధించి పూర్తి సమాచారం కోసం ఆర్టీసీ కాల్‌సెంటర్ నంబర్లు 040-69440000,040-23450033ను సంప్రదించాలని కోరారు.

సైబర్ క్రిమినల్స్‌పై సీబీ'ఐ'

- దేశవ్యాప్తంగా 32 చోట్ల సోదాలు, 26 మంది అరెస్టు
- రూ.58.45 లక్షల నగదు, కీలక పత్రాలు స్వాధీనం
- డిజిటల్ సామగ్రి, లాకర్ల తాళాలు, కార్లు కూడా

హైదరాబాద్, సెప్టెంబర్ 30 (నమస్తే తెలంగాణ): అమాయకులను లక్ష్యంగా చేసుకొని కోట్ల రూపాయలు కొల్లగొడుతున్న సైబర్ నేరగాళ్లపై కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) దృష్టి సారించింది. ఆ కేటుగాళ్ల నెట్‌వర్క్‌లను ధ్వంసం చేయాలన్న లక్ష్యంతో ప్రారంభించిన 'ఆపరేషన్ చక్ర-3'లో భాగంగా గురువారం నుంచి దేశవ్యాప్తంగా విస్తృత సోదాలు చేపట్టింది. హైదరాబాద్‌లోని వయాజెక్స్ సొల్యూషన్స్, పుణెలోని వీసీ ఇన్‌ఫ్రాటెక్, విశాఖపట్నంలోని వీసీ ఇన్‌ఫ్రాటెక్, అత్రియా గ్లోబల్ సర్వీసెస్ తదితర సంస్థల కాల్‌సెంటర్లలో సోదాలు నిర్వహించి 26 మందిని అరెస్టు చేసినట్టు ప్రకటించింది. వీరిలో విశాఖకు చెందిన 11 మంది, పుణెకి చెందిన 10 మంది, హైదరాబాద్‌కు చెందిన నలుగురు ఉన్నట్టు వెల్లడించింది. ఈ సోదాల్లో రూ.58.45 లక్షల నగదు తోపాటు పలు కీలక పత్రాలు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలు, కమ్యూనికేషన్ రికార్డులు, భారీ సంఖ్యలో లాకర్ల తాళాలు, 3 లగ్జరీ వాహనాలను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపింది.

టెక్ సర్వీస్ సపోర్ట్ సర్వీసుల పేరుతో..

అమాయకుల నుంచి అందినకాడికి దోచుకునేందుకు సైబర్ నేరగాళ్లు 'టెక్ సపోర్ట్ సర్వీస్'ల పేరుతో కంపెనీలను ప్రారంభిస్తున్నట్టు సీబీఐ గుర్తించింది. మీ సిస్టమ్స్ హ్యాక్ అయ్యాయని, మీ బ్యాంకు ఖాతాల నుంచి పెద్ద ఎత్తున అనధికార లావాదేవీలు జరుగుతున్నాయని అమాయకులను బెదిరించి పథకం ప్రకారం డబ్బులు వసూలు చేస్తున్నట్టు తెలిపింది.

ఏకంగా నాలుగు ఉద్యోగాలకు ఎంపిక

- రైల్వేలో పనిచేస్తూ లెక్చరర్, గ్రూప్-4, ఏఈఈ జాబ్స్‌కు సెలక్ట్
- ఐబీ శాఖలో ఏఈఈగా విధుల్లో చేరిన రాజశేఖర్‌రెడ్డి

గణపురం, సె